'అన్వేషణ' వారపత్రిక - జనవరి 9, 1996

# అలిగిన వేళ

సీతకి రామం స్వంతం.

రామానికి సీత స్వంతం.

వాళ్ళిద్దరికీ ఆ ఇల్లు స్వంతం.

అందంగా పెంచబడ్డ చెట్లూ, మొక్కలతో నిండి ఉన్న పెద్ద స్థలం మధ్య పొందిగ్గా తీర్చిదిద్దబడిన చిన్న ఇల్లది.

ఆ ఇంటి డాబా మీదకి, మెట్ల మీదగా పాకించబడిన సన్నజాజి తీగకి పూసిన పువ్వుల వాసన –

డాబా మీద కూర్చున్న రామం ముక్కుకీ –

పడగ్గదిలో కిటికీ పక్కన కూర్చున్న సీత నాసికకీ –

ఒకేలా తగులుతోంది.

అలానే వెన్నెల కూడా వాళ్ళిద్దరికీ ఒకేలా కనిపిస్తోంది.

అలాంటి ఆహ్లాదకరమైన వెన్నెల రాత్రులలో – వాళ్ళిద్దరూ అలా విడిగా ఉండడం అదే మొదటిసారి.

అసలు వాళ్ళు విడిగా ఎప్పుడూ ఉండరు. అలాంటది – వాళ్ళ పెళ్ళి రోజున, వాళ్ళిద్దరూ అలా విడిగా ఉండడం – ఆ ఇంట్లోని మొక్కలకీ, చెట్లకే కాక, ఆకాశంలోని చంద్రుడికి కూడా కొత్తగా, వింతగా ఉంది.

సాయంత్రం సీత గుడికి వెళ్ళి వచ్చేవరకూ, ఇద్దరూ కులాసాగా, ఆనందంగా గడిపారు.

ఉదయం –

సీతకి ఇష్టమని, సీత కోసం, రామం చేసిన పాయసం, రామం తినిపిస్తే తింది సీత.

మధ్యాహ్నం–

తమ స్థలంలో ఉన్న మామిడి చెట్టు పండు కోసి, తొక్కలు తీసి, చిన్న ముక్కలు చేసి, రామానికి తినిపించింది సీత.

ఆ చెట్టుని నాటింది సీతే! ఒక్క ఆ చెట్టునే కాదు – ఇంటిలోని మొక్కలన్నీ సీత నాటినవే!! వాటికి నీళ్ళు పోసి పెంచుతున్నది వాళ్ళిద్దరే!!!

సాయంత్రం –

మల్లెమొగ్గలు కోసి, దండ కట్టి, సీత జళ్ళో పెట్టబోతూ నవ్వాడు రామం.

"నవ్వకండి – రాత్రి నేను వచ్చేవరకూ ఆగండి" అని అంటూ ఆ దండను రామం దగ్గర నుండి తీసేసుకుంది సీత. తీసుకుని, "గుడికి వెళ్ళివస్తాను" అంటూ బయల్దేరింది.

అంతకు ముందటి అన్ని పెళ్ళి రోజులలానే – ఆ రోజు కూడా – రామం కొన్న చీర కట్టుకుంది సీత.

జరీ చుక్కలు ఉన్న ముదురు నీలం రంగు పట్టుచీర, మెరిసే నక్షత్రాలు నిండి వున్న ఆకాశంలా ఉంది.

ఆ చీరలో సీతను చూసి, 'సీత మొహమే చంద్రుడు' అని అనుకుని తృప్తిగా నవ్వుకున్నాడు రామం.

గుడి నుండి సీత తిరిగి రావడం కోసం రామం ఎదురు చూస్తూండగా వచ్చింది ఎదురింటి సుందరి.

సుందరి పేరుకే కాదు. రూపానికి కూడా సుందరే!

అందంగా ఉన్న సుందరి, ఆకర్షణీయంగా తయారవుతుంది.



ఆ రోజు తను వేసుకున్న ఎఱ్ఱ రంగు డ్రెస్‌కి మేచింగ్‌గా, విరబోసుకున్న తన జుట్టులోకి, ఎఱ్ఱరంగు పువ్వు పెట్టుకుందామని వచ్చింది సుందరి.

ఒక పక్క నిండుగా విచ్చుకున్న ఎఱ్ఱరంగు రోజా పువ్వుని చూసి – "ఎంత బావుందో" అని గొంతులోనూ, మొహంలోనూ ఆనందాన్ని వ్యక్తం చేసి, "అది కోసుకుంటాను" అని – దాన్ని కోసుకుని, తల్లో పెట్టుకుని, "థాంక్స్" అని అంటూ బయటికి నడిచింది సుందరి.

ఏమనాలో తెలియక నవ్వాడు రామం.

సరిగ్గా ఆ సమయానికే గుడి నుండి తిరిగి ఇంటికి వస్తున్న సీత కళ్ళల్లో పడ్డాయి – సుందరి జడలోని పువ్వూ, రామం మొహంలోని నవ్వూ.

వెంటనే రోజా మొక్కని చూసింది.

తను వెళ్ళేటప్పుడు ఎఱ్ఱగా, అందంగా పూసిన పువ్వుతో వున్న మొక్క వెల వెల పోతోంది.

ఆ మొక్కని కొన్నాళ్ళ క్రితం ఎవరి దగ్గరో అడిగి తీసుకువచ్చి నాటింది సీత. దాన్ని జాగ్రత్తగా చూసుకుంటోంది. కొన్ని రోజుల క్రితం మొగ్గ వేసిందది. ఈ రోజుకి పువ్వు అందంగా తయారయింది.

పువ్వులేని మొక్క సీతని వెక్కిరించినట్లయింది.

అలా అవుతుందని సీత ఊహించలేదు.

రామం వైపు ఒక్కసారి కోపంగా చూసి, ఇంట్లోకి చరచరా నడుచుకుంటూ వెళ్ళి తలుపు వేసేసుకుంది సీత.

సీతకు కోపం రావడం ఇంతవరకూ చూళ్ళేదు రామం. సరదాకి కూడా సీత కోపం తెచ్చుకోలేదు.

ఏం చెయ్యాలో తెలియలేదు రామానికి.

పురాణ కథల్లో సత్యభామ అలుగుతుంది. ఆవిడ అలకను కృష్ణుడు తీరుస్తాడు. అలా అలకను తీర్చడంలో కృష్ణుడు ఎంతో ఆనందం అనుభవిస్తాడు.

అయితే ఆ ఆనందం అనుభవించే అవకాశం రాముడికి దక్కలేదు. పౌరాణిక సీత అలగలేదు. అలాగే ఈ సీత కూడా.

రామం తలుపు దగ్గరకెళ్ళి సీతను తలుపు తియ్యమని అడిగాడు.

సీత తియ్యలేదు.

సత్యభామ అలిగినప్పుడు, కృష్ణుడు వచ్చి అలక తీర్చేందుకు వీలుగా, తలుపులు తీసి ఉంచింది.

అయితే సీత తలుపులు మూసేసుకుంది.

మూసిన తలుపులు తెరుచుకుంటాయేమోనని, కొంతసేపు ఎదురు చూసాడు రామం.

సీత తలుపు తియ్యలేదు.

అక్కడ నిల్చుని ఏంచెయ్యాలో తెలియక, నెమ్మదిగా మెట్లెక్కి, డాబా మీద కూర్చున్నాడు రామం.

సుందరి తమ ఇంటికి వచ్చి, సీత దగ్గర పువ్వులు తీసుకోవడం కొత్త కాదు. అది ఈ రోజు మొదటిసారి జరగలేదు. అలాంటప్పుడు సుందరి పువ్వు కోసుకుంటే, సీతకి ఎందుకు కోపం వచ్చిందో అర్థం కాలేదు రామానికి.

పెళ్ళి రోజున, సీత అలా కోపగించుకుని, ఇంట్లోకి వెళ్ళి తలుపు వేసేసుకోవడం కష్టంగా అనిపించింది రామానికి. సీత వచ్చి పిలిచినా వెళ్ళకూడదనుకున్నాడు.

సరిగ్గా ఆ సమయానికే, పడగ్గదిలో కూర్చున్న సీత కూడా రామం వచ్చి మళ్ళీ పిలిచినా తలుపులు తియ్యకూడదనుకుంది. సుందరి తల్లో పువ్వుని చూసినప్పుడు వచ్చిన కోపం పోయి, ఆ స్థానంలో తన కోపానికి కారణం అడగకుండా రామం వెళ్ళిపోయాడన్న బాధ నిండుకోసాగింది.

భార్యాభర్తలలో ఎవరో ఒకరు అలగడం సహజం. అలా చాలామంది దంపతులకి,

చాలాసార్లు జరుగుతుంది. రెండోవారు, అలిగినవారి అలకని తీరుస్తారు. ఆ తర్వాత ఇద్దరూ సంతోషంగా ఉంటారు. దాంపత్య జీవితాలలో అలకలు సన్నటి పన్నీటి జల్లులు.

అయితే రామం, సీతా ఎన్నడూ ఎరగనిది అలక.

అందుకే వాళ్ళకి అలాంటి సమయంలో ఏం చెయ్యాలో తెలియడం లేదు.

పెళ్ళినాటికి, సీతకి ఇరవై రెండేళ్ళు.

ఆ వయస్సుకి ఎంత పెరగాలో, అంతే పెరిగిన సుకుమార శరీరంతో, తెల్లని దంతం బొమ్మకి ప్రాణం వచ్చినట్లుంది సీత, పెళ్ళి పీటల మీద.

ప్రపంచంలోని సౌందర్యాన్నంతా ఒక్కచోట పోగుచేసి అందంగా తీర్చిదిద్దితే సీత అవుతుందనుకున్నాడు రామం – సీతని పెళ్ళి రోజున చూసి.

సీత సౌందర్యానికి సరిపోయే అందమే రామానిది కూడా.

అందుకే పెళ్ళికి వచ్చిన వాళ్ళంతా, వాళ్ళని చూసి ఆనందించి, "వాళ్ళు సీతా రాములే" అని మెచ్చుకున్నారు.

వాళ్ళిద్దరూ – వాళ్ళనుకున్నట్లుగానే – ఒకరికి ఒకరుగా, ఒకరుగా అయిపోయారు.

రామానికి ఏం కావాలో చూసి చేస్తుంది సీత.

సీత అడగకుండానే సీతకి కావాల్సినవి చూస్తాడు రామం.

ఒకరిని ఒకరు ఎప్పుడూ తప్పు పట్టుకోలేదు వాళ్ళు.

సరదాకి కూడా ఒకరి మీద ఒకరికి కోపం రాలేదు.

అలాంటిది, ఈ పెళ్ళిరోజున, దూరంగా ఉన్నారు వాళ్ళు. అలా ఉండడం ఇద్దరికీ కష్టంగానే ఉంది.

'కోపగించుకుని ఇంట్లోకి వెళ్ళిపోకుండా ఉండాల్సింది' అనుకుంది సీత.

'సీతకి కోపం వచ్చిన కారణం కనుక్కుని ఉండాల్సింది' అనుకున్నాడు రామం.

'రాత్రి తొమ్మిదవుతోంది. ఆయన భోజనం వేళ' అనుకుంది సీత.

'చీకటి పడింది. కింద ఒక్కతే ఎలాగుందో' అనుకున్నాడు రామం.

'బయట ఏ చెట్టు కింద కూచున్నారో, పాపం' అని అనుకుంటూ బయటికి రావడానికి లేచింది సీత.

"కిందకి వెళ్ళి పిలుస్తాను" అని అనుకుంటూ లేచాడు రామం.

అంతవరకూ పైన కూర్చుని కోసిన జాజిపువ్వులు దోసిటలో ఉంచుకొని, డాబా అంచుకు వచ్చాడు.

అదే సమయానికి, ఆ అంచు కిందకి వచ్చింది సీత.

అప్పుడే వీచిన ఒక గాలి తెమ్మెర రామం దోసిటలోని పువ్వులని తోసుకుని తీసికెళ్ళి, సీత తల మీద జల్లుగా కురిపించింది.

హఠాత్తుగా తన మీద కురిసిన పూలవానకి పులకించి, నవ్వుతూ తలెత్తి పైకి చూసింది సీత.

పై నుండి, సీత తల మీదకి రామం చేతులు నుండి పువ్వుల వాన కురిస్తే –

కింద నుండి, రామం కళ్ళకి సీత మొహం నుంచి నవ్వుల వాన కురిసింది.

రామం ఆనందంగా నవ్వాడు.

రామాన్ని పైన చూడగానే, సీత మెట్లెక్కి పైకెళ్ళింది.

"పైకి ఎందుకు ఎక్కారు?" అని అడిగింది రామాన్ని.

"నువ్వు ఇంటి తలుపులు వేసుకుంటే నేనింక ఏం చెయ్యను?" అని అడిగాడు రామం.

రామాన్ని పొదివి పట్టుకుని, కిందకి నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకెళ్ళి, గున్నమామిడి చెట్టు కింద, తన ఒళ్ళో కూర్చోపెట్టుకుంది సీత.

రామం కళ్ళల్లో ఆనందపు పొర.

సీత కళ్ళల్లో ఆత్మీయపు తడి.

"మీ ఆరోగ్యం గురించి పట్టింపు లేదా? ఇలా పైకి ఎక్కి వెళ్ళవచ్చా?" అంది సీత.

"నువ్వు ఇంటి తలుపులు వేసుకోవచ్చా?" అని అడిగాడు రామం.

"మరి మీరు పువ్వుని సుందరికి ఇవ్వచ్చా?" అంది సీత.

"నేనివ్వలేదు" అన్నాడు రామం.

ఆ మాటలను విననట్లు అంది సీత –

"ఆ రోజా మొక్కని నేను కొన్నాళ్ళ క్రితం తీసుకొచ్చి దొడ్లో నాటింది ఎందుకో తెలుసా? అది ఎర్రని రంగు రోజా పువ్వు పూస్తుందని. ఆ పువ్వుని, నేను మీ చేతుల మీదుగా నా జుట్టులో పెట్టించుకోవచ్చుననుకున్నాను. అదృష్టం కొద్దీ, అది మన పెళ్ళిరోజు నాటికి అందంగా పువ్వయింది – దాన్ని మీరు సుందరికి ఇచ్చేసారు"

"నేనియ్యలేదు సీతా – సుందరే తీసికెళ్ళిపోయింది"

"ఆ మాట మీరు చెప్పలేదు"

"నువ్వు నన్ను అడగలేదు"

"ఇదంతా వదిలెయ్యండి. సాయంత్రం, మల్లెపువ్వుల దండ తల్లో పెట్టబోతూ ఎందుకు నవ్వారు?" అని అడిగింది సీత.

"నీకు తెలియదా?" అన్నాడు రామం.

"నా జుట్టు నెరిసిందనేగా? నల్లగా లేదనేగా?"

"నీ జుట్టు నెరిస్తేనేం – ఇంకా ఒత్తుగా, పొడుగ్గా ఉంది. నా తల చూడు – అసలు జుట్టే లేదు"

సీత నవ్వింది. నవ్వి –

"తెల్ల జుట్టులో మల్లెపువ్వులు ఏం బావుంటాయి? అందుకే మీ చేతుల మీదుగా ఈ పెళ్ళి రోజున నా జుట్టులో ఎర్రని రోజా పువ్వు పెట్టించుకుందామనుకున్నాను. ఆ అవకాశం తప్పిపోయేసరికి, బాగా నిరుత్సాహ పడిపోయాను. ఇన్నాళ్ళ మన వివాహ జీవితంలో ఇదే మొదటిసారి" అని సీత అంటుంటే –

"అలిగావు. అవునా?" అని అడిగాడు రామం.

"అయితేనేం – మీరు అలక తీర్చలేదుగా" అంది సీత.

"నీ మీద పూల వాన కురిపించాను. అంతకన్నా ఏం చెయ్యాలి, అలక తీర్చేందుకు?" అని అడిగాడు రామం.

"అందులో రోజా పువ్వు లేదుగా"

"రోజాది ఏం ఎరుపు సీతా? అంతకన్నా ఎర్రనైనది – రాగరంజితమైనది – నా హృదయం – నా గుండె – నీ జుట్టులో పెడుతున్నాను" అని అంటూ, తన గుండెను కోసి, సీత జడలో పెడుతున్నట్లు అభినయించాడు రామం.

సిగ్గుపడింది సీత.

అరవై అయిదు ఏళ్ళు వస్తున్నా సిగ్గు వదలలేదు సీత.

అరవై అయిదు ఏళ్ళు దాటినా అమాయకత్వం వీడలేదు రామం.

ఇన్నేళ్ళుగా – ఆ ఇంట్లోని మొక్కలని పెంచుతున్నట్లు – వాళ్ళిద్దరూ – ఒకరి మీద ఒకరు ప్రేమను పెంచుకుని పెద్ద చేసుకుంటూనే ఉన్నారు.

ఆ రోజు వాళ్ళ నలభయ్యవ పెళ్ళిరోజు. ఆ రోజున మొదటిసారిగా అలిగింది సీత – అలాగే రామం – అదీ కొంతసేపే – అంతే!

ఇన్నాళ్ళూ ప్రేమే తప్ప – ప్రణయ కలహాలు తెలియని వాళ్ళకి, కొంత సరసం నేర్పగలిగాననని ఆనందించింది రోజా మొక్క.

ఎన్నడూ విడిగా ఉండని వాళ్ళని, ఓ రెండు గంటలు విడిగా ఉంచింది ఈ రోజా మొక్కని బాధపడ్డాయి తక్కిన మొక్కలన్నీ.

వాటి భావాలతో సంబంధం లేకుండా –

ఒకరి పక్కన ఒకరు నడుచుకుంటూ ఇంట్లోకి వెళ్లారు సీతారాములు. ❃